

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 36.0
కనిష్ఠం : 27.0



ఈవీఎంలను భద్రపరిచే గదికి తాళం వేస్తున్న సిబ్బంది



పర్యవేక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ఈవీఎంలు భద్రం

- విష్ణు విద్యాసంస్థలు, ఎస్ఆర్‌కేఆర్ కాలేజీల్లోని స్ట్రాంగ్ రూమ్‌లకు తరలింపు
- ఆయా ప్రాంతాల్లో పటిష్ఠ బందోబస్తు
- కలెక్టర్ సుమిత్‌కుమార్ పరిశీలన

భీమవరం, టౌన్, మే 14 :ఎన్నికలు ముగిశాయి. సోమవారం అర్ధరాత్రి సమయానికి ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటు చేసిన విష్ణు విద్యాసంస్థలు, ఎస్ఆర్‌కే ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలకు సోమవారం రాత్రి తరలించారు. ఉండి, భీమవరం, తాడేపల్లిగూడెంకు నియోజక వర్గాలకు చెందిన ఈవీఎంలను ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్‌రూమ్‌లలో భద్రపరిచారు. విష్ణు విద్యాసంస్థలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్‌రూమ్‌లకు నరసాపురం, పాలకొల్లు, ఆచంట, తణుకు నియోజకవర్గాల ఈవీఎంలను తరలించారు. సిబ్బందినుంచి వివరాలను సేకరించేందుకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. తరలింపు ప్రక్రియను కలెక్టర్ సుమిత్‌కుమార్ పరిశీలించారు. తెల్లవారుజామునుంచి ఉదయం పదకొండు గంటల వరకు అక్కడే ఉండి అన్నీ పూర్తయిన తరువాత సీల్ వేసే ప్రక్రియను పూర్తిచేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సాయుధ బలగాల ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. వచ్చే నెల నాలుగో తేదీన కౌంటింగ్‌రోజు వరకు ఈ బందోబస్తు కొనసాగుతుంది. ప్రతీరోజు అధికారులు పర్యవేక్షణ చేస్తారు. వలు పార్టీల ప్రతినిధులు సమక్షంలో సీల్ వేయడంతో పాటు ఆయా సీళ్లు సక్రమంగా ఉన్నాయో లేదు పరిశీలించుకునేందుకు ప్రత్యే సమయాల్లో పార్టీ అభ్యర్థులు పరిశీలించుకునేందుకు అవకాశం కల్పిస్తారు.

వైసీపీలో స్తబ్దత





రెండు నియోజకవర్గాలపై ప్రత్యేక చర్చ

- ఉండిలో ఓట్ల చీలికపై ఆశలు
- భీమవరం కూటమిలో సమన్వయలోపం కలసి వస్తుందని కాకిలెక్కలు
- అధిక సంఖ్యలో తరలివచ్చిన ఇతర ప్రాంతాల స్థానిక ఓటర్లు
- పోలింగ్ శాతం పెరగడంతో వైసీపీ అభ్యర్థుల్లో వణుకు



భీమవరం-ఆంధ్రజ్యోతి : సార్వత్రిక ఎన్నికల తరువాత వైసీపీలో స్తబ్ధత నెలకొంది. వైసీపీ సొంత సర్వేలోను జిల్లాలో ఆ పార్టీకి దెబ్బతగలనుందని అంచనాకువచ్చారు. ఎన్నికలు జరుగుతున్నప్పుడే అభ్యర్థుల్లో అనుమానాలు రేకెత్తాయి. ఓటింగ్ సరళి, వైసీపీ నాయకుల పట్ల ఓటర్లలో స్పందన కరువైంది. మరోవైపు కేడర్‌లోను ఉత్సాహం ఎగిరిపోయింది. ఎన్నికలు ముగిసిన తరువాత వైసీపీ శ్రేణులు పూర్తిగా నైరాశ్యంలోకి వెళ్లిపోయారు. ఎక్కడా చర్చలు లేవు, పార్టీ గెలుస్తుందన్న ఉత్సాహంలేదు. స్థానిక అభ్యర్థులు గెలుస్తారన్నా విశ్వాసం పార్టీ శ్రేణుల్లో సన్నగిల్లింది. అందుకు భిన్నంగా కూటమిలో జోష్ నెలకొంది. కూటమి అభ్యర్థులంతా విజయంపై లెక్కలు వేసుకుంటున్నారు. ఎగ్జిట్ పోల్ సంస్థలు కూడా కూటమి నేతలకు గెలుపుపై ఉప్పు అందించాయి. జిల్లాలో అన్ని సీట్లు కూటమి నెగ్గుతుందంటూ స్పష్టం చేశాయి. ఇది కూడా కూటమిలో ఉత్సాహానికి కారణమైంది. ఎన్నికల సమయంలో కూటమి అభ్యర్థులకు, నేతలకు ఓటర్లనుంచి సానుకూల సంకేతాలు వచ్చాయి. ఎన్నడూ లేనివిధంగా కసితో జనం ఓట్లువేశారు. ప్రభుత్వ వ్యతిరేకతతో పాటు, స్థానిక నాయకత్వంపై ఉన్న అసంతృప్తి ఓటర్లను ప్రభావితం చేసింది. తెలుగుదేశం, జనసేన, బీజేపీ మేనిఫెస్టోపైన ప్రజల్లో చర్చ సాగింది. వైసీపీ మేనిఫెస్టో డీలా పడింది. ఇదికూడా ప్రజలను ప్రభావితంచేసింది. జిల్లాలో పాలకొల్లు, ఉండి, ఆచంట, తణుకులో టీడీపీ పోటీచేస్తే భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురంలలో జనసేన అభ్యర్థులు కూటమి తరపున బరిలో నిలిచారు. జిల్లాలో జనసేన, టీడీపీలకు బలమైన ఓటు బ్యాంకు ఉంది అనేక ఎన్నికలలో కూటమికి కలసి వచ్చింది.

పెరిగిన ఓటింగ్‌తో డీలా



జిల్లాలో ఓట్ల పోలింగ్ శాతం పెరగడంతో వైసీపీ అభ్యర్థుల్లో వణుకు పుట్టిస్తోంది. ఈసారి ఎన్నికలు ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఎన్ఆర్ఐలు కూడా లక్షల రూపాయలు ఖర్చుపెట్టి ఓటింగ్‌లో పాల్గొన్నారు. వారంతా రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్తుకోసమే ఓటు వేశామని చెప్పడమే వైసీపీ నాయకుల్లో ఆందోళన కలిగిస్తోంది. ప్రతీ నియోజకవర్గంలోకి సుమారు ఐదు వేల మంది తరలివచ్చారు. కూటమి అభ్యర్థులు బస్సు సౌకర్యం కల్పించారు. రైలు, ప్రైవేట్ బస్సుల్లో చెన్నై, హైదరాబాద్, బెంగళూరు నుంచి తరలివచ్చారు. వారంతా కూటమి వైపు ఉన్నారు. గతంలో హైదరాబాద్ నుంచి వచ్చిన వారు వైసీపీకి అండగా నిలిచారు. ఇప్పుడు పరిస్థితి మారి వారు కూటమికి మద్దతు పెరిగిందని అంటున్నారు.

ఆ రెండింటిపై జోరుగా పందేలు

ఉండి నియోజకవర్గంలోనే కాస్త పందేలు జరుగుతున్నాయి. వైసీపీ మెజారిటీ సాధిస్తుందంటూ పందేలు కాస్తున్నారు. అయితే అక్కడ తెలుగుదేశం అభ్యర్థి రఘురామకృష్ణంరాజు విజయం సాధిస్తారని పార్టీ శ్రేణులతోపాటు పందెగాళ్ళు జోరుగా పందేలు పడుతున్నారు. వైసీపీ అక్కడ ఓట్ల చీలికపైన ఆశలు పెట్టుకుంది. ఇండియన్ ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి శివరామరాజుకు 25 వేలు ఓట్లుపడితే వైసీపీ గెలుపు సాధ్యం అవుతుందని నియోజకవర్గంలో లెక్కలు వేసుకుంటున్నారు. కానీ జనసేన ఓటు బ్యాంకు, టీడీపీ ఓటు బ్యాంకు, ప్రభుత్వ వ్యతిరేకతను వైసీపీ పరిగణనలోకి తీసుకోవడం లేదు. కానీ శివరామరాజు చీల్చే ఓట్లపైనే ఆశలు పెట్టుకున్నారు. భీమవరంలో వైసీపీ కాకి లెక్కలు వేసుకుంటోంది. కూటమిలో సమన్వయలోపం ఉందంటూ అంచనాలు వేసుకుంటున్నారు. తెలుగుదేశం, జనసేన ముఖ్యులు అంజిబాబుకు కలసి రాలేదంటూ ఒకే ఒక్క కారణంతో భీమవరంపై వైసీపీ అధిష్టానమే సానుకూలంగా ఉంది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. కూటమి జనసేన అభ్యర్థి అంజిబాబుకు, తెలుగుదేశం శ్రేణులు అంతా తమ సొంతవానిగా భావించి జనసేన శ్రేణులు ఏకతాటిపైకి తేవడంలో కూటమి వ్యూహాలు పనిచేశాయి. ప్రభుత్వ వ్యతిరేకత, అధికార పార్టీ అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్‌పై అసంతృప్తి అంజిబాబు మంచితనం ఎన్నికలలో కనిపించింది. వీటిని పరిగణనలోకి తీసుకోకుండా ఒకరిద్దరు నాయకులు కూటమికి కలసి రాలేదన్నా కారణంతో వైసీపీ కాకిలెక్కలు వేస్తూ పందేలు కాస్తున్నారు.

కొంపముంచిన 'అతి' ప్రచారం

- రూ.వంద కోట్లు ఖర్చు చేస్తారంటూ ప్రచారం
- ఓటుకు రూ.ఐదు వేలు అంటూ ఆర్భాటం
- సైకిల్ స్పీడుకు రెక్కలు విరిగిన ఫ్యాన్ !
- పాలకొల్లులో వైసీపీ నష్టాలపై చర్చ
- వైసీపీ నాయకుల్లో తగ్గని గెలుపు ధీమా !

పాలకొల్లు, మే 14 : పాలకొల్లు అసెంబ్లీ నియోజక వర్గంలో వైసీపీ అతిప్రచారమే కొంప ముంచింది అంటూ పార్టీ శ్రేణుల్లోనే చర్చ జరుగుతోంది. తొలిగా పాలకొల్లు వైసీపీ అభ్యర్థి భారీ మెజార్టీతో గెలిపించి జగన్‌కు కానుకగా ఇస్తామని ప్రచారం చేసుకున్న ఆ పార్టీలోని పలువురు నాయకులు ఇప్పుడు తలలు పట్టుకుంటున్నారు. గత నాలుగైదు నెలలుగా పార్టీ శ్రేణులు చేస్తున్న ప్రచారంలో రూ.వంద కోట్లు ఖర్చు చేస్తారని, ఓటుకు రూ.5000 ఇస్తారని ప్రచారం జరిగింది. చివరకు కొంతమందికి ఓటుకు వంద రూపాయలు విదిల్చారని పలువురు ఓటర్లు పెదవి విరిచే పరిస్థితి ఏర్పడింది. పాలకొల్లులో సైకిల్ స్పీడ్‌కు ఫ్యాన్ కొట్టుకుపోతుందని సర్వత్రా ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. పాలకొల్లులో వైసీపీ నష్టాలపై ఒక వైపు చర్చ జరుగుతుండగా టీడీపీ అభ్యర్థి డాక్టర్ నిమ్మల రామానాయుడు భారీ మెజార్టీతో గెలుపుపొందుతారని పందేలు జరుగుతుండగా, వైసీపీ నాయకుల్లో మాత్రం గాంభీర్యం తగ్గడం లేదు. ఇంత జరిగినా తమ అభ్యర్థే గెలుస్తాడంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. గతంలో కాంగ్రెస్ అభ్యర్థిని బంగారు ఉషారాణి మెగాస్టార్ చిరంజీవిపై గెలిచిన రీతిలోనే ఇప్పుడు తమ అభ్యర్థి గుడాల గోపి 5, 6 వేల ఓట్లతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

- ప్రభుత్వ వ్యతిరేకతకు తోడు, వైసీపీ ఓట్లకు సొమ్ములు పంపిణీలో తేడాలు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి నెట్‌వర్క్, గత అనుభవాలు, 2014 నుంచి 2019 వరకు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి మొత్తంగా టీడీపీ అభ్యర్థికి మేలు చేస్తాయని పట్టణంలో చర్చించుకుంటున్నారు. అంతేకాకుండా వైసీపీ అభ్యర్థి కొంతమంది ద్వితీయ శ్రేణి నాయకులను నమ్మి సొమ్ము పంపిణీకి అవకాశం ఇస్తే, ఆ వ్యక్తులు తమ ఇళ్లల్లోని విద్యుత్ లైట్లు తీసివేసి వందలాది మందిని ఇంటికి పిలిపించుకుని సుమారు 20 లక్షలు ఇస్తే 8 లక్షలు పంపిణీ చేసి మిగిలిన సొమ్ములు నొక్కేసినట్టు పలువురు చర్చించుకుంటున్నారు. ఈనేపథ్యంలో టీడీపీ అభ్యర్థి నిమ్మలకు పట్టణంలోనే 20 వేలు మెజార్టీ వస్తుందని, యలమంచిలి మండలం, పాలకొల్లు రూరల్ మండలం, పోడూరు మండలంలోని గ్రామాలు కలిపి మరో 30 వేలు మెజార్టీ వస్తుందని మొత్తంగా 50 వేలుకు తగ్గని మెజార్టీతో నిమ్మల హాట్రిక్ సాధిస్తారని ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి.
- కర్ణుడి చావుకు సవాలక్ష కారణాలు అనే రీతిలో పాలకొల్లులో వైసీపీ అభ్యర్థి గుడాల గోపికి స్థానికేతరతతో పాటు, పార్టీ కేడర్‌లో నమ్మదగ్గ స్థాయిలో పూర్తి సహకారం లేకపోవడం, చివరిలో అనుకున్న స్థాయిలో సొమ్ములు ఖర్చు చేయకపోవడం, గెలుపుపై నమ్మకం సన్నగిల్లడం, తదితర కారణాలు వైసీపీ వెనుకపడడానికి దోహదం చేశాయని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. అలాగే నమ్మిన నాయకులు సహకారం అందించక పోవడంతో పాటు, వెన్నుపోటు పొడిచినట్టు చెప్పుకుంటున్నారు.

82.60 శాతం పోలింగ్

- జిల్లాలో రికార్డు స్థాయిలో ఓటింగ్ నమోదు
- సోమవారం అర్ధరాత్రి వరకు కొనసాగిన పోలింగ్
- అత్యధికంగా ఉండిలో 86.20 శాతం



భీమవరం టౌన్, మే 14 : జిల్లాలో రికార్డు స్థాయిలో ఓటింగ్ నమోదైంది. మహిళలు, యువత, అత్యధికంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. సోమవారం అర్ధరాత్రి వరకు జిల్లాలోని పలు కేంద్రాల్లో పోలింగ్ కొనసాగింది. ఉదయం నుంచి పోలింగ్ పక్రియ నెమ్మదిగా సాగడంతో ఓటర్లు క్యూకట్టారు. జిల్లాలో ఉండి నియోజకవర్గంలోనే అత్యధికంగా ఓటర్లు పోలింగ్‌లో పాల్గొన్నారు. ఈసారి ఉండి నియోజకవర్గం రికార్డును బ్రేక్ చేసింది. అత్యధికంగా 86.20 శాతం ఓట్లు నమోదయ్యాయి. జిల్లాలో పోలింగ్ శాతం 82.60గా నమోదైంది. సంఖ్యాపరంగా చూస్తే భీమవరంలో అత్యధిక మంది ఓటర్లు ఓటు వేశారు. ఓటింగ్ శాతంలో జిల్లాలో అన్నింటికంటే తక్కువగా నమోదైన ఓటర్లుగా నమోదైంది. ఓటర్లు ఇతర ప్రాంతాల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవడంతో ఆశించిన స్థాయిలో ఓటింగ్ పెరగలేదు.

జిల్లాలో ఓటింగ్ ఇలా

నియోజవర్గం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పురుషులు	మహిళలు	ఇతరులు	శాతం
భీమవరం	2,53,116	2,00,857	99,174	1,01,656	27	79.35
టిపిగూడెం	2,14,985	1,75,990	87,208	88,773	9	81.86
తణుకు	2,34,575	1,92,736	94,042	98,690	4	82.16
పాలకొల్లు	1,95057	1.60,489	79,802	80,684	3	82.28
నరసాపురం	1,70,448	1,43,835	72,598	71,227	10	84.38
ఆచంట	1,80017,	1,49,048	73,024	76,022	2	82.80
ఉండి	2,24,725	1,93,722	96,695	97,025	2	86.20
జిల్లా మొత్తం	14,72,923	12,16,667	6,02,543	6,14,077	57	82.60



దాళ్వా పంట మాసూళ్లు చేస్తున్న దృశ్యం

ఉరుకులు.. పరుగులు

- వాతావరణ మార్పులతో రైతుల్లో భయం
- దాళ్వా పంట మాసూళ్లలో రైతులు నిమగ్నం
- జిల్లాలో 25 వేల ఎకరాలు మాసూళ్లవ్వాలి

భీమవరం రూరల్, మే 14 : దాళ్వా పంట మాసూళ్లు సాగుతూనే ఉన్నాయి. మరోవైపు వాతావరణ మార్పులు.. అకాల వర్షాల మధ్య పంటను గట్టెక్కించే ప్రయత్నంలో రైతులు ఉరుకులు, పరుగులు తీస్తున్నారు. గడిచిన నెలరోజులుగా పంట మాసూళ్లు జరుగుతూనే ఉన్నాయి. జిల్లాలో 2లక్షల 25వేల ఎకరాలలో దాళ్వా సాగు సాగగా ఇప్పటివరకు 2 లక్షల ఎకరాలలో పంట మాసూళ్లయింది. ఐదు లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం విక్రయాలు జరిగాయి. ఇంకా 25వేల ఎకరాలలో మాసూళ్లు జరగాల్సి ఉంది. రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రాసులుగా, మాసూళ్లకాని పంట చేనుగా ఉందని వ్యవసాయశాఖ జిల్లా అధికారులు అంచనా వేస్తున్నారు. ఈలెక్కన మరోవారం రోజులు పంట మాసూళ్ల ధాన్యం విక్రయాల ప్రక్రియ కొనసాగుతుందనే కనిపిస్తుంది.

ఎన్నికలు.. అకాల వర్షాలతో జాప్యం..

అకాల వర్షాలతో చాలా ప్రాంతాలలో మాసూళ్లు రెండు, మూడు రోజులు నిలిపివేశారు. దీంతోపాటు ఎన్నికల రోజున పంట మాసూళ్లు పూర్తిగా నిలిపివేశారు. ఇంకా వాతావరణంలో మబ్బులు ఏర్పడడంతో పాటు చిన్నపాటి వర్షం కురవడంతో రైతులు భయపడుతున్నారు.

ఎండా..వాన!

మొగల్తూరు, మే 14: గత కొద్ది రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 8 గంటలకే సూర్యుడు తన ప్రతాపం చూపడంతో ప్రజలు, వ్యవసాయ కార్మికులు, కూలీలు పనులు చేయడానికి ముందుకు రావడం లేదు. మంగళవారం ఉదయం నుంచి మొగల్తూరు జాతీయ రహదారితో పాటు ప్రధాన కూడళ్ళు నిర్మానుష్యంగా మారాయి. కొన్ని ప్రాంతాల్లో సాయంత్రం సమయాల్లో అకస్మాత్తుగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈదురు గాలులు, వర్షాలు పడుతున్నాయి.



మొగల్తూరులో నిర్మానుష్యంగా రోడ్డు

ఎవరినీ వదలం

- కార్యకర్తలను కాపాడుకుంటాం గాయపడిన వారికి టీడీపీ పరామర్శ

ఏలూరు క్రైం, మే 14 : తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను కాపాడుకోవడానికి తాము చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఏలూరు పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ, ఉమ్మడి కూటమి అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్ యాదవ్ అన్నారు. ఏలూరు రూరల్ మండలం చాటపర్రు, దెందులూరు మండలం సోమ వరప్పాడులో వైసీపీ నాయకుల దాడిలో గాయాలపాలైన టీడీపీ కార్యకర్తలు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మంగళవారం ఉదయం మహేష్ యాదవ్ పరామర్శించి ఆత్మస్థైర్యం కల్పించారు. 20 రోజుల్లో టీడీపీ ప్రభుత్వం వస్తుందని వచ్చిన తరువాత ఐదేళ్ల నుంచి అరాచకాలు చేసిన ఏ ఒక్కరిని వదిలిపెట్టబోమని ఖచ్చితంగా చట్ట ప్రకారం వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

- ఓటమి భయంతోనే దాడులకు టీడీపీ శ్రేణులపై దాడులకు తెగబడ్డారని ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ అన్నారు. దెందు లూరు నియోజకవర్గంలో పలుగ్రామాల్లో టీడీపీ కార్యకర్తలపై జరిగిన దాడుల్లో గాయాలపాలైన వారిని ఆయన ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించారు. అన్ని విధాలా అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు. ఎన్నికల్లో దాడి చేసి ఓటర్లను భయపెట్టి ఓట్లను ఆక్రమించాలని చూసిన వైసీపీకి ప్రజలు తమ ఓటుతో తగిన గుణపాఠం చెప్పారన్నారు. తప్పు చేసిన వారందరికి చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.
- వైసీపీ పాలనకు ప్రజలు చరమగీతం పాడారని ఏలూరు తెలుగుదేశం పార్టీ ఉమ్మడి కూటమి అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య (చంటి) అన్నారు. వివిధ గ్రామాల్లో వైసీపీ నాయకుల దాడితో గాయపడి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్తలను బడేటి చంటి పరామర్శించారు.



వివరాలు తెలుసుకుంటున్న మహేష్ యాదవ్





గాయపడి ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్యకర్తలను పరామర్శిస్తున్న చింతమనేని ప్రభాకర్, బడేటి చంటి



కూటమి నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ఈవీఎంలు తరలించేశారు

భీమవరంలో కూటమి నాయకుల ఆందోళన
రిజర్వ్ ఈవీఎంలని కలెక్టర్ వివరణ

భీమవరం టౌన్, మే 14: పోలింగ్ ముగిసిన తరువాత ఈవీఎంల తరలింపులో గందరగోళం నెలకొంది. ఈవీఎంలు తరలింపులో వాహనం మధ్యలో నిలచిపోవడంతో కూటమి నాయకులు ఆందోళనకు దిగారు. భీమవరం సమీపంలోని ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద సోమవారం అర్ధరాత్రి బీజేపీ ఎంపీ అభ్యర్థి భూపతి రాజు శ్రీనివాసవర్మ ఆందోళనకు దిగారు. ఈవీఎంలు పనిచెయ్యకపోతే పంపే రిజర్వు ఈవీఎంల వాహనం నిలచిపోయిందని, పోలింగ్ జరిగిన ఈవీఎంలు కాదని కూటమి నాయకులకు కలెక్టర్ సుమిత్ కుమార్ వివరించారు. నిలచిపోయిన వాహనంకు సంబంధి వీడియోతీసి వైరల్ చెయ్యడంతో కూటమి నాయకులు ఆందోళనకు దిగారు. రిజర్వ్ ఈవీఎం వెహికల్‌పై గందరగోళ పరిస్థితి వాస్తవ పరిస్థితిని వివరించిన జిల్లా కలెక్టర్ సమిత్ కుమార్ క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను వివరించి అనుమానాలను నివృత్తి చేయడంతో పరిస్థితి సద్దుమణిగింది.

వైసీపీ కుట్రలు విఫలం

జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు

పిఠాపురం, మే 14: వైసీపీ కుట్రలు విఫలమయ్యాయని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు అన్నారు. పిఠాపురం నుంచి పోటీ చేసిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు ఎంత మెజార్టీ ఇస్తారనేది ప్రజల నిర్ణయంమని, ప్రజలకు ఏమి చేస్తాం, ఎంత అభివృద్ధి చేస్తామనేదే పార్టీకి ముఖ్యమని తెలిపారు. కుమారపురంలో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధికి పవన్‌కల్యాణ్ బాధ్యతాయుతమైన వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. శ్రామికులు స్వేదం తుడుచుకోవడానికి వాడే కాశీ తువ్వాలుపై కూడా వైసీపీ చేసిన కుట్రలు విఫలమయ్యాయని చెప్పారు. పవన్ జనసేన అధ్యక్షుడి హోదాలో రాష్ట్రవ్యాప్తంగా జనసేనతో పాటు కూటమి తరపున ప్రచారం నిర్వహించారని తెలిపారు. పిఠాపురానికి పూర్తిస్థాయిలో సమయం కేటాయించలేని పరిస్థితుల్లో జనసైనికులు, వీరమహిళలు అహర్నిశలు శ్రమించారని తెలిపారు. పవన్ కోసం రాష్ట్రం నుంచే గాక తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి ఎంతో మంది స్వచ్ఛందంగా వచ్చి ప్రచారం నిర్వహించారన్నారు. పవన్‌ను నిలబెట్టుకోవడానికి, గెలిపించుకునేందుకు పిఠాపురం ప్రజలు పరితపించిన తీరు తమకు సంతోషాన్ని ఇచ్చిందని చెప్పారు. వైసీపీ దుర్మార్గ పాలనను తరిమికొట్టేందుకు ప్రజలంతా రాష్ట్రవ్యాప్తంగా బయటకు వచ్చి ఓటు వేశారన్నారు. మర్రెడ్డి శ్రీనివాసరావు, వేములపాటి అజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్న ప్రసాద్

పెండింగ్ కేసులు రాజీ చేయాలి

ఏలూరు క్రైం, మే 14: కోర్టులలో కేసులు విపరీతంగా పెరిగిపోవడంతో వాటి పరిష్కారానికి కృషి చేయాలని, ఇరుపక్షాలకు ఆమోదయోగ్యమైన రాజీ పరిష్కారం చేయాలని న్యాయమూర్తులు, న్యాయవాదులకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె రత్న ప్రసాద్ సూచించారు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలో వివాద పరిష్కార ప్రత్యామ్నాయం, మధ్యవర్తిత్వం అంశంపై న్యాయవాదులకు ఒక్క రోజు అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. రత్న ప్రసాద్ మాట్లాడుతూ న్యాయవాదులు, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కారం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కానాల రామకృష్ణారావు, తిగిరిపల్లి సుబ్బారావు, రత్నరాజులు పాల్గొన్నారు. ఏలూరు బార్ అసోసియేషన్ కార్యదర్శి ఎన్ఎంఎం నాగరాజు, న్యాయవాదులు పాల్గొన్నారు.



నౌడూరు ఫ్లాగ్ టవర్ వద్ద కుసుమను సత్కరిస్తున్న వడ్డి సుబ్బారావు

బంగారు పతక విజేత కుసుమకు సత్కారం

భీమవరం రూరల్, మే 14: వీరవాసరం గ్రామానికి చెందిన రావాడ కుసుమ లాంగ్ జంప్‌లో జాతీయ స్థాయి గోల్డ్ మెడల్ సాధించడంతో మంగళవారం ఆమెను సత్కరించారు. నౌడూరు జంక్షన్‌లోని నేషనల్ ఫ్లాగ్ టవర్ వద్ద కుసుమను సన్మానించి రూ. 10 నగదు ప్రోత్సాహకం అందించారు. నేషనల్ టవర్ ఫ్లాగ్ నిర్మాత వడ్డి సుబ్బారావు అధ్యక్షతన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కుసుమకు అందరూ సహకరించాలని కోరారు. పాల శ్రీనివాస్, వలవల శేషు, కుప్పిచెట్టు పార్వతి, వడ్డి సూర్యకుమారి, బండి ఆంజనేయులు, మహిళలు పాల్గొన్నారు.



దగ్ధమైన కొబ్బరి దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నిమ్మల

పాలకొల్లులో కొబ్బరి దుకాణం దగ్ధం

పాలకొల్లు టౌన్, మే 14: పట్టణంలోని బద్దవానిపేటలో మంగళవారం షార్టు సర్క్యూట్‌తో కొబ్బరికాయల దుకాణం దగ్ధమైంది. దుకాణ యజమాని సీర్రా భాస్కరరావు సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి మంటలను అదుపు చేశారు. అప్పటికే కొబ్బరికాయలు పూర్తిగా కాలిపోయాయి. ఆస్తి నష్టం రూ.5లక్షలు ఉంటుందని ఫైర్‌స్టేషన ఆఫీసర్ వైవి జానకిరామ్ తెలిపారు. దగ్ధమైన కొబ్బరికాయల దుకాణాన్ని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు పరిశీలించారు. యజమానిని వివరాలు అడిగి సాయం అందేలా చూస్తానన్నారు



మన నియోజకవర్గంలో ఏ పార్టీ గెలుస్తుందంటావ్.. ఫ్యాన్ పార్టీకి ఎదురుగాలి తప్పేట్టు లేదు. ఫ్యాన్ పార్టీ గెలుస్తుందని పందేనికి ఒక్కరూ రావడం లేదు మామ. అసలు కోసు పందేలన్నా ముందుకు రావడం లేదు. పోని రాష్ట్రంలో సీఎం సీటుపైనా పందెం ఉందేమో చూడు.. సీట్లు అయినా ఓకే. లేదు మామ నిన్నటి వరకూ వైసీపీ 70 సీట్లని రావులపాలెం రెడ్లు తిరిగారు. ఇప్పుడు వాళ్లు కూడా ఫోన్ ఎత్తడం లేదు. సరేలే ఏదొకటి గ్రామాల్లో మెజార్టీ అయినా చూడరా. ఇది గ్రామాల్లో ఏ మూలన చూసినా ఇదే చర్చ.

తాడేపల్లిగూడెం రూరల్, ఆచంట, లింగపాలెం

పందెం అంటే.. పరార్

● ఎన్నికల ఫలితాల్లో కూటమి వైపే పందేలు ● జంకుతున్న అధికార పార్టీ

పోలింగ్ ముగియడంతో ప్రధాన పార్టీల విజయావకాశాలపై పందేలకు పలువురు ఎగబడుతున్నారు. ప్రధానంగా కూటమి విజయంపై పందేలకు మొగ్గు చూపుతున్నారు. అధికార పార్టీ తరపు నుంచి పందేలకు పెద్దగా ముందుకు రావడం లేదని పందెంరాయుళ్లు నిరాశ చెందుతున్నారు.

ఆ పార్టీ వాళ్లు కనిపిస్తే ఒట్టు!

పందెం రాయుళ్లు పందేల కోసం ఫోన్ చేయని మనిషి లేదు. అడగని నాయకుడు లేదు. ఎవరినైనా కదిలిస్తే కనీసం పౌరుషానికైనా పందేనికి దిగుతారని భావించి తెలిసిన ఫ్యాన్ పార్టీ వాళ్లను కదిలించి మరీ పందేలకు కాలుదువ్వుతుంటే కనీసం బెసకడం లేదనేది కూటమి నాయకుల బాధ. ఫ్యాన్ పార్టీకి మన గ్రామంలో అయినా మెజార్టీ వస్తే బాగుంటుందని లేదంటే మనకు తల కొట్టేసినట్టుంటుందని ఆ పార్టీ నాయకుల మనోవేదనకు గురవుతున్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ఓ గ్రామంలో బూత్ బాధ్యతలు తీసుకున్న వ్యక్తి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంతో పది మంది కూటమి నాయకులు భారీ మొత్తంతో పందేనికి సై అన్నారు. దీంతో అవతలి వ్యక్తి తప్పనిసరి పరిస్థితిలో పందేనికి దిగారు. ఈ తరహా మరే పదేలకు వెళ్లకుండా అధికార పార్టీ వారు పలాయనం చిత్తగిస్తున్నారు.

లింగపాలెం మండలంలో కూడా కొందరు పందేలకు సిద్ధపడితే అధికార పార్టీ వైపు నుంచి ఎవరూ ముందుకు రావడం లేదు. గతం కంటే పోలింగ్ పెరగడం, గంటల తరబడి క్యూలో నిలబడి ఓటేయడంపై అధికార పార్టీ విజయావకాశాలపై నమ్మకం సన్నగిల్లుతోంది.

ఆచంటలో పందేల జోరు

ఆచంట నియోజకవర్గంలో పందేల జోరు ఆసక్తికరంగా ఉంది. ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది. జిల్లాలో ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి. ఆచంట ఫలితం ఎలా ఉంటుందనే చర్చలతో పాటు బెట్టింగ్‌కు సిద్ధపడుతున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వస్తుందని, కూటమి సీట్లు, వైసీపీ సీట్లపై సంఖ్యపై జోరుగా బెట్టింగ్‌లు జరిగినట్లు సమాచారం. ఎక్కువ శాతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వస్తుందనే బెట్టింగ్‌లు కాయడం గమనార్హం. ఆచంటలో రాష్ట్రంలో రాబోతున్న ప్రభుత్వంపై లక్షల్లో పందేలు వేసినట్లు సమాచారం. ఆచంట నియోజకవర్గ ఫలితంపై కూడా గ్రామాల వారీగా పోలింగ్ సరళిని లెక్కలు వేస్తున్నారు. ఆచంట ఫలితంపై కూడా కోట్ల రూపాయల పందేలకు సమాయత్తమవుతున్నారు.

పెరిగిన ఓటు రేటు!

ముదినేపల్లి: ఓటు రేటు బాగా పెరిగింది. గత 50 ఏళ్లలో ఓటు ధర ఎన్నో రెట్లు పెరిగింది. 1972 సార్వత్రిక ఎన్నికల్లో కొన్ని చోట్ల రాజకీయ పార్టీలు ఓటు కొనుగోలు చేసినట్లు కొందరు చెబుతున్నారు. అప్పట్లో అభ్యర్థులు ఓటుకు రూ.5 ఇచ్చినట్లు గుర్తు చేసుకుంటున్నారు. ఇప్పుడు ఓటు కనీస ధర రూ.వెయ్యి కాగా సాధారణ ఎన్నికల్లో గరిష్ఠంగా రూ.5 వేలు కూడా ఉన్నట్లు సమాచారం. అభ్యర్థుల ఆర్థిక పరిస్థితిని బట్టి ఒక్కో నియోజకవర్గంలో ఓటు రేటు ఒక్కొక్క రకంగా ఉంది. రెండు దశాబ్దాలుగా ధనవంతులు రాజకీయ రంగ ప్రవేశంతో ఓట్ల కొనుగోలు సర్వసాధారణమైంది. విచ్చలవిడిగా ఓట్ల కొనుగోలుతో ఓటు ధర కూడా బాగా పెరిగింది. 2014 సాధారణ ఎన్నికల్లో ఓటుకు రూ.500 చొప్పున పంపిణీ చేయగా 2019లో రూ. వెయ్యి కనీస ధర అయింది. ప్రస్తుత ఎన్నికల్లో అది కాస్తా రూ.5 వేలకు పెరిగింది. ఓటరుతో సంబంధం లేకుండా ఓటు కొనుగోలు చేసే నాయకులే రేటు పెంచడం గమనార్హం. నాయకులు కొనుగోలు చేసినా ఓటరు ఓటు అమ్ముకున్నాడా? నచ్చిన వారికే ఓటు వేశాడా అనేది ప్రశ్నార్థకం. భవిష్యత్‌లో ఓటు రేటు ఏ స్థాయికి చేరుతుందోనని రేటు నిర్ణయించే నాయకులే ఆందోళన చెందుతున్నారు.

పచ్చడి ఘాటు

» మామిడి ధరకు రెక్కలు
» మండుతున్న కారం » కాగుతున్న నూనె



పాలకొల్లు రూరల్/గణపవరం, మే 14: పచ్చళ్ల సీజన్‌కు ఎన్నికలు అడ్డుపడ్డాయి. పోలింగ్ ముగియడంతో ఆవకాయ పచ్చడిపై మహిళలు దృష్టి సారించారు. వేసవిలో ఆవకాయ, మాగాయ వంటి పచ్చళ్లు పెట్టుకోవడం సర్వసాధారణం. మామిడి నుంచి కారం, నూనె వరకు ధరలు పెరగడంతో పచ్చటి ఘాటెక్కింది. పేద మధ్య తరగతి వారికి పచ్చడి చేదుగా మారింది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ప్రధాన పట్టణాలు, మండలాల్లో మామిడి కాయ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

హడలెత్తిస్తున్న ధర

ఈ ఏడాది మామిడి ధర వింటేనే హడలెత్తిపోతున్నారు. ఆవకాయ పచ్చడికి పేరొందిన కొత్తపల్లి కొబ్బరి 100 కాయలు రూ.3500 ధర పలుకుతున్నాయి. చిన్న రసాలు రూ.2వేల వరకు, పెద్ద రసాలు రూ.1500 - రూ.1800, సువర్ణరేఖ రూ.1500, దేశవాళి రకం రూ.1400 చొప్పున విక్రయాలు జరిగాయి. స్తోమతను బట్టి మామిడి కాయలు కొనుగోలు చేసుకుంటున్నారు. మామిడి దిగుబడి తగ్గడం, వర్షాలు, వడగళ్లు మామిడిని దెబ్బతీశాయి. తుని, చింతలపూడి, జంగారెడ్డిగూడెం, జికొత్తపల్లి, కంసాలిగుంట, తదితర ప్రాంతాల నుంచి దిగుమతి అవుతున్నాయి.

100 కాయల పచ్చడి రూ.10 వేలు

గత కొన్ని రోజులుగా మార్కెట్‌లో పలు రకాల పచ్చడి మామిడి కాయలు మార్కెట్‌లో దొరుకుతున్నాయి. ధరలు పెరగడంతో వంద కాయల పచ్చడి పెట్టుకునే వారు 50 కాయలతో సరిపెట్టుకుంటున్నారు. వంద కాయలతో ఆవకాయ పచ్చడికి సుమారు రూ 10వేలు ఖర్చవుతున్నదని మహిళలు చెబుతున్నారు. కాయను ముక్కలుగా చేయడాని కాయకు రూ3, గానుగ నూనె (నువ్వుల నూనె) లీటరు రూ 600, వేరుశనగ రూ. 180, పచ్చడి కారం కిలో రూ800, వెల్లుల్లి పావుకిలో రూ80, ఆవాలు కిలో రూ140, మెంతులు కిలో రూ.130 అమ్ముతున్నారు.

సీజన్ కూలీలకు ఉపాధి



పచ్చడి మామిడి కాయలు కొనుగోలు చేసినవారు ముక్కలు కొయ్యలేక మార్కెట్‌లోనే ముక్కలు కొట్టిస్తారు. ముక్కలు కొట్టడంలో కాయ దెబ్బతింటే పచ్చడి కూడా పాడవుతుంది. సీజన్‌లో జిల్లాలోని వారపు సంతలకు మామిడి ముక్కలు నరికే మహిళలు కుటుంబాలతో తరలివస్తారు. మామిడి ముక్కలు నరకడమే వారి జీవనోపాధి. పెనుగొండ, పాలకొల్లు, గణపవరం, మాముదూరు, తదితర ప్రాంతాల నుంచి 20 కుటుంబాల వారు మహిళల తో సహా వచ్చి పచ్చడి మామిడిముక్కలు నరుకుతుంటారు. ముక్కలు నరికి నందుకు కాయకు రూ.3 చొప్పున వంద కాయలకు రూ.300 తీసుకుంటారు. గత ఏడాది కాయకు రూ.2చొప్పున వసూలు చేయగా ఈ ఏడాది కాయకు రూ3చొప్పున వసూలు చేసుకున్నారు. జిల్లాలోని అన్ని పట్టణాల్లో ప్రధాన మార్కెట్లలో మామిడి ముక్కలు కొట్టేవారికి గిరాకీ ఉంది. వేసవి నెలరోజులు ఈ కుటుంబాలకు జీవనోపాధిని ముక్కలు నరికే శ్రామికులు తెలిపారు.

16 నుంచి గుంటూరు ఎక్స్‌ప్రెస్ తాత్కాలికంగా రద్దు

నరసాపురం, మే 14: నరసాపురం నుంచి గుంటూరు ఫాస్ట్ ప్యాసింజర్ రైలును గురువారం నుంచి ఈనెలాఖరు వరకు రద్దు చేశారు. గుంటూరు డివిజన్‌లో ట్రాక్ పనులు చేపడుతున్నందున్న ఈ నిర్ణయం తీసుకున్నారు. 17282 నెంబర్‌తో ఉదయం 6 గంటలకు ఈ రైలు భీమవరం, ఆకివీడు, కైకలూరు మీదుగా విజయవాడ వెళుతుంది. తిరిగి 07181 నెంబర్‌తో బయలుదేరుతుంది. ఉదయం, సాయంత్రం సమయాల్లో ఈ రైలు షెడ్యూల్ సమయాలు వ్యాపారులు, ఉద్యోగులకు అనుకూలంగా ఉండడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. గతంలో ఈ రైలును నాలుగు నెలల పాటు రద్దు చేశారు. ఆ సమయంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆ సమయంలో ఎంపీ రఘురామకృష్ణంరాజు రైల్వే మంత్రితో మట్లాడి ఈ రైలును పునరుద్ధరించారు. ప్రస్తుతం 15 రోజుల పాటు రద్దు ప్రకటన వెలువడింది. గతంలో మాదిరిగా దీన్ని పొడిగిస్తే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ఆ సమయంలో విజయవాడకు మరో రైలు లేదు.

ఉమ్మడి జిల్లాలో ప్రవీణ్ ప్రకాష్ పర్యటన వాయిదా

ఏలూరు ఎడ్యుకేషన్, మే 14 : పాఠశాల విద్య ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పర్యటన వాయిదా పడింది. ఉమ్మడి జిల్లాలోని పాఠశాలల సందర్శన, మండలాల్లోని విద్యాకానుక స్టాక్‌పాయింట్ల పరిశీలనకు బుధవారం ఆయన రావాల్సి ఉంది. పోలింగ్ విధుల్లో ఉపాధ్యాయులు, హెచ్ఎంలు, ఎంఈవోలు అవిశ్రాంతంగా ఉండడంతో ప్రిన్సిపల్ సెక్రటరీ పర్యటన ఈ నెల 18కి వాయిదా పడింది. ఆ రోజున ఉదయం 9గంటలకు ప్రవీణ్ ప్రకాష్ జిల్లాకు రానున్నారని విద్యాశాఖ నుంచి స్థానిక విద్యాధికారులకు వర్తమానం అందింది. పదో తరగతి, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ప్రత్యేక తరగతులు, బైజూస్ కంటెంట్‌తో ఐఎఫ్‌పిలు పనితీరు, ట్యాబ్‌ల వర్కింగ్ కండీషన్, నోట్స్, వర్క్ బుక్‌ల కరెక్షన్, విద్యార్థుల ఇళ్ల సందర్శన, నాడు-నేడు/విద్యాకానుక, పాఠశాలల ప్రాంగణాల పరిశుభ్రత, ఫ్యూచర్‌స్కిల్ ఎక్స్‌పర్ట్స్, టోఫెల్ కార్యకలాపాలు తదితర అంశాలపై పీఎస్ నేరుగా పరిశీలించనున్నారు.



పోలవరంలో జోరుగా కురుస్తున్న వర్షం

పోలవరంలో భారీ వర్షం

పోలవరం, మే 14: మండలంలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ చిరెత్తించిన ఎండ వాతావరణం అకస్మాత్తుగా మారిపోయింది. చల్లని గాలులతో ఉక్కబోత నుంచి ఉపశమనం పొందారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. బెస్తావీధి, బాపూజీ కాలనీ, కమ్మరగూడెం, కృష్ణారావుపేట, నూతనగూడెం, ప్రాంతాలలో డ్రైనేజీలు పొంగి రోడ్లు వీధులు జలమయమయ్యాయి. మెయిన్ బజార్‌లో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో నీరు నిలిచి ప్రజా నీకం, స్థానిక వ్యాపారులు ఇబ్బందులకు గురయ్యారు. దీంతో రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. ఈదురు గాలులకు పోలవరం నుంచి కన్నాపురం మార్గంలో పలుచోట్ల చెట్ల కొమ్మలు రోడ్డుపై విరిగిపడ్డాయి. వాహనదారుల రాకపోకలకు అంతరాయం కలిగింది. గూటాల, కొత్తపట్టిసీమ, పట్టిసీమ, పోలవరంలో రోడ్లపై ఆరబెట్టిన వరి, మొక్కజొన్న కాపాడుకోడానికి రైతులు అవస్థలు పడ్డారు.

కొయ్యలగూడెంలో..

కొయ్యలగూడెం : మండలంలో మంగళవారం సాయంత్రం వర్షం పడింది. ఉదయం నుంచి ఎండ తీవ్రతతో అల్లాడిన ప్రజలకు ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వర్షం కురవడంతో సేదతీరారు. పట్టణంలోని డ్రైన్లు పొంగిపొర్లాయి. మురుగు రోడ్లపై రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

పెదపాడు: ఉదయం నుంచి ఎండ వేడితో ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేసిన వాతావరణం సాయంత్రానికి కాస్త చల్లబడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పలు గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన చిరుజల్లులు కురిశాయి. దీంతో ముందు జాగ్రత్త చర్యగా విద్యుత్‌ను నిలిపివేశారు.

పాముకు దహన సంస్కారం

మొగల్తూరు, మే 14: మండలంలోని పేరుపాలెం సౌత్ గ్రామంలో నివాసాల మధ్య మృతి చెందిన నాగపాముకు గ్రామస్థులు మంగళవారం దహన సంస్కారం నిర్వహించారు. గ్రామంలోని మేళం వారి మెరకలో నివాసాల మధ్య తాచుపాము చనిపోయి ఉంది. గమనించిన స్థానికులు దాన్ని దైవ సమానమైన నాగపాముగా భావించి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులంతా పామును పాడెపై ఊరేగించి దహన సంస్కారాలు చేశారు.



నాగపాముకు దహన సంస్కారాలు నిర్వహిస్తున్న గ్రామస్థులు

మోటార్‌సైకిల్‌ను ఢీకొన్న లారీ

అక్కిరెడ్డిగూడెం వద్ద ప్రమాదం.. మేనమామ, మేనల్లుడు దుర్మరణం





చికిత్స పొందుతూ మృతి చెందిన గుజ్జుల రంగారావు లారీ చక్రాల కింద గొర్రెల ప్రకాష్ మృతదేహం

దెందులూరు, మే 14: మేనమామను మేనల్లుడు మోటార్ సైకిల్‌పై తీసుకువెళుతుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. అక్కిరెడ్డిగూడెం వద్ద మంగళవారం మోటార్‌సైకిల్‌ను లారీ ఢీ కొంది. దెందులూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేగివాడ గ్రామానికి చెందిన గుజ్జుల రంగారావు ఏలూరులో తన మేనల్లుడు గొర్రెల ప్రకాష్ ఇంటికి వెళ్లాడు. తిరిగి మేనమామ రంగారావును వేగివాడలో దింపేందుకు మంగళవారం ఉదయం మోటార్ సైకిల్‌పై ప్రకాష్ బయలుదేరాడు. అక్కిరెడ్డిగూడెం సమీపంలో లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గొర్రెల ప్రకాష్ లారీ కిందపడి అక్కడిక్కడే పడి మృతి చెందాడు. తీవ్ర గాయాలైన రంగారావును ఆసుపత్రికి తరలించడానికి అంబులెన్స్ అందుబాటులో లేదు. స్థానిక టీడీపీ నేతలు ఆటోలో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడారు. రంగారావు చికిత్స పొందుతూ మృతి చెందాడు. దెందులూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కూలీలు

కుక్కునూరు, మే 14: ఉపాధిహామీ కూలీలపై తేనెటీగల దాడి చేసిన నేపథ్యంలో పలువురు గాయపడ్డారు. మండల పరిధిలోని దామరచర్లలో మంగళవారం ఉపాధి కూలీలు చెరువు పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో తేనెటీగలు ఒక్కసారిగా చెదిరి ఉపాధి కూలీలపై దాడి చేశాయి. ఈ దాడిలో 20మంది కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం వారిని అమరవరం పీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు వారికి వెంటనే వారికి వైద్యం అందించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఉపాధి కూలీలు తరచు తేనెటీగల బారిన పడుతున్నారు.

ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం.5

పాఠకుని పూర్తి పేరు : ....

డోరు నెంబరు : .... వీధి పేరు : ....

గ్రామం/పట్టణం : .... మండలం : ....

జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. ఆచంట				
2. పాలకొల్లు				
3. నరసాపురం				
4. భీమవరం				
5. ఉండి				
6. తణుకు				
7. తాడేపల్లిగూడెం				
8. ఉంగుటూరు				
9. దెందులూరు				
10. ఏలూరు				
11. పోలవరం				
12. చింతలపూడి				
13. గోపాలపురం				
14. కొవ్వూరు				
15. నిడదవోలు				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం : రాచర్ల రోడ్, అలంపురం, తాడేపల్లిగూడెం, పశ్చిమగోదావరి జిల్లా - 534 166.

ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



పాలకొల్లు అర్బన్, మే 14: పట్టణంలోని కెనాల్ రోడ్డులోని శ్రీ దాసాంజనేయ స్వామికి మంగళవారం సందర్భంగా ప్రత్యేకంగా గంధ సింధూర, తమలపాకుల పూజలు చేశారు. ఈసందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు హనుమాన్ చాలీసా పఠించారు. యడ్ల బజారులోని పంచ ముఖాంజనేయ స్వామి, రైలు గేటు వద్ద, వెలమ గూడెంలోని పలు ఆంజనేయ స్వామి వార్ల ఆలయాలో ప్రత్యేకంగా పూజలు చేశారు.

నేటి నుంచి అతిరాత్ర మహాయాగం



యాగం ఏర్పాట్లపై మాట్లాడుతున్న గజల్ శ్రీనివాస్

భీమవరం టౌన్, మే 14 : డీఎన్ఆర్ కళాశాల క్రీడా మైదానంలో బుధవారం నుంచి అతి రాత్ర మహాయాగ కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయని గజల్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారంనాడు ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ యాగాలతో మంచి యోగాలు శుభ పరిణామాలు కలుగుతాయని యాగాలలో పాల్గొనడం, ఆశీర్వచనాలు పొందడం, దర్శించుకోవడం జన్మకు సార్థకత అని అన్నారు. దోషాలు నివృత్తికి ఈ యాగాలు మంచి ఫలితాలు ఇస్తాయని అన్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తణుకు, మే 14: తణుకు బాలుర ఉన్నత పాఠశాలలో 2003-04 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమావేశం మంగళవారం పట్టణంలోని సిల్వర్ స్పూన్ రెస్టారెంట్‌లో జరిగింది. పూర్వ విద్యార్థులు గత స్మృతులను నెమరువేసుకున్నారు. ఉత్సాహంగా గడిపారు. ఆనాటి గురువులను సన్మానించారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి కృషి చేద్దామని నిర్ణయించారు.

ఆచంటలో 82.80 శాతం పోలింగ్

ఆచంట, మే 14: ఆచంట నియోజకవర్గంలో 82.80 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. 2019 ఎన్నికల్లో 79 శాతం పోలింగ్ శాతం అయితే ఈ సారి 3 శాతం అదనంగా పోలింగ్ నమోదు అయ్యింది. ఈ సారి ఎన్నికలు ఇరుపార్టీలు చాలెంజ్‌గా తీసుకోవడంతో ఓటర్లు కూడా ఓటు వేయడానికి అంతే ఉత్సాహం చూపించారు. ఎపుడూ లేని విధంగా వివిధ ప్రాంతాల్లో ఉన్న ఓటర్లు కూడా పెద్ద ఎత్తున వచ్చి ఈ ఎన్నికల్లో ఓటు వేయడం విశేషం. నియోజకవర్గంలో సాయంత్రం 9 గంటల వరకు కూడా కొన్ని చోట్ల పోలింగ్ జరిగింది. నియోజకవర్గంలో లక్షా 80 వేల 17 ఓట్లకు గాను లక్షా 49 వేల 048 ఓట్లు పోలవగా 82.80 శాతం నమోదు అయ్యింది. పురుషులు కంటే మహిళలే ఎక్కువ శాతం తమ ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. అలాగే 4 ట్రాన్స్ జెండర్స్ ఓటర్లుకు గాను వీరిలో ఇద్దరు తమ ఓటు హక్కును ఉపయోగించుకున్నారు.

ప్రజలతోనే ఉంటా: సీతారాం



విలేకరులతో మాట్లాడుతున్న సీతారాం

భీమవరం అర్బన్, మే 14: గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రజలతోనే ఉంటానని భీమవరం నియోజకవర్గ కాంగ్రెసు పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అంకెం సీతారాం అన్నారు. మంగళవారం భీమవరంలోని పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించి తనకు సహకరించిన సీపీఎం, సీపీఐ నాయకులు నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఏ సమస్య వచ్చినా ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. వెల్లువెత్తిన ఓటింగ్ సరళి శుభసూచకమని, యువత పెద్ద ఎత్తున ఓటింగ్‌లో పాల్గొనడం ప్రజాస్వామ్యస్ఫూర్తిని ప్రతిబింబిస్తుందన్నారు.

చదరంగం, వైకుంఠపాళి పోటీలు

పాలకొల్లు అర్బన్, మే 14: వేసవి సెలవులు సందర్భంగా చిన్నారులలో నిబిడీకృతమైన నైపుణ్యాన్ని వెలికితీయడం, క్రీడా స్ఫూర్తిని కలిగించాలన్న ధ్యేయంలో చదరంగం, వైకుంఠ పాళీ ఆటల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు పప్పుల దుర్గేష్ (నేత్రన్ దుర్గేష్) మంగళవారం తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులకు పోటీలను నిర్వహించి, బహుమతులు అందజేయనున్నామన్నారు. పోటీలను ఈనెల 26వ తేదీ ఆదివారం ఉదయం 10గంటలకు పెద్ద గోపురం వద్ద ఉన్నరేపాక వారి సత్రంలో నిర్వహించడం జరుగుతుందని, ఆసక్తి కలిగిన వారు తమపేర్లను నమోదు చేయించుకోవాలని, ఇతర వివరాలకు 92905 40512 సంప్రదించ వచ్చునని దుర్గేష్ తెలిపారు.

వైసీపీ మండల అధ్యక్ష పదవికి రాజీనామా

యలమంచిలి, మే 14: వైసీపీ యలమంచిలి మండల అధ్యక్ష పదవికి తాను రాజీనామా చేసినట్లు పొత్తూరి బుచ్చిరాజు తెలిపారు. మంగళవారం కలగంపూడి గ్రామంలోని ఆయన నివాసం వద్ద బుచ్చిరాజు విలేకరులతో మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా తనకు అనారోగ్య సమస్యలు ఉన్నాయని, ఎన్నికలకు నెలరోజుల ముందు శస్త్రచికిత్స చేయించుకున్నానని చెప్పారు. కేవలం హెల్త్ ఇష్యూస్ కారణంగానే పార్టీ మండల అధ్యక్ష పదవికి రాజీనామా చేశానని తెలిపారు. వేరే పార్టీలలో చేరే ప్రసక్తే లేదని, వైసీపీలోనే కొనసాగుతానని స్పష్టం చేశారు. ఆరోగ్యం కుదుటపడిన తరువాత రాజకీయాల్లో పాల్గొంటానని అన్నారు.

యలమంచిలిలో 84.75శాతం ఓటింగ్

యలమంచిలి, మే 14: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో మండలంలో 84.75శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ విజయశ్రీ తెలిపారు. మండలంలో మొత్తం 57,010 ఓటర్లకుగానూ పురుషులు 24255 మంది, స్త్రీలు 24063 మంది మొత్తం 48,318 మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకున్నారని ఆమె వివరించారు.



ముదినేపల్లిలో ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద కిక్కిరిసిన జనం

మద్యం కోసం బారులు తీరిన జనం

ముదినేపల్లి, మే 14 : ప్రభుత్వ మద్యం దుకాణాల వద్ద మద్యం ప్రియులు మంగళవారం బారులు తీరారు. ఎన్నికల సందర్భంగా ఈ నెల 11 నుంచి మ ద్యం దుకాణాలను మూసివేయటం, రాజకీయ పార్టీల నుంచి ఆశించినంత రీతిలో మద్యం అందకపోవటంతో మద్యం ప్రియులకు మందు మూడు రోజుల పాటు అందుబాటులో లేకుండా పోయింది. పోలింగ్ ముగియటంతో మంగళ వారం ప్రభుత్వ మద్యం దుకాణాలను తిరిగి తెరిచారు. దీంతో మందు కోసం ఉదయం 8 గంటల నుంచి ముదినేపల్లి మండలంలోని ప్రభుత్వ మద్యం దుకా ణాల వద్ద జనం బారులు తీరారు. షాపులు తెరవగానే మందుబాబులు మద్యం కోసం ఎగబడ్డారు. ముదినేపల్లిలోని మద్యం దుకాణం వద్ద పెద్ద సంఖ్యలో మందు కోసం ఎగబడ్డారు. ఎన్నికల పుణ్యమా అని చేతిలో డబ్బు కూడా పుష్కలంగా ఉండటంతో మందు కోసం తెగ ఆరాట పడిపోయారు.







బీజేపీ ఎంపీ అభ్యర్థి శ్రీనివాసవర్మకు బొకే అందించిన నరసాపురం టీడీపీ నాయకులు.. పాలకొల్లులో స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నిమ్మల.. జనసేన అభ్యర్థి బొలిశెట్టికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కూటమి నాయకులు, కార్యకర్తలు

ముందస్తుగానే అభ్యర్థులకు అభినందనలు

రామానాయుడు కార్యాలయంలో సందడి

పాలకొల్లు రూరల్, మే 14: గత కొంతకాలంగా ఎన్నికలు సందర్భంగా ఎమ్మెల్యే నిమ్మల కార్యాలయం ఎన్నికల సందడితో నిండి ఉంది. ఎన్నికలు పూర్తి కావడంతో మంగళవారం తిరిగి యథావిధిగా ప్రజలు ఎమ్మెల్యే రామానాయుడు వద్దకు వచ్చి తమ సమస్యలను చెప్పుకున్నారు. 5ఏళ్ళుగా ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ఏవిధమైన ప్రజా సమస్యలైనా తలెత్తితే నేనున్నాను అంటూ పోరాటాలు చేస్తూ ప్రజల మనస్సుల్లో నిమ్మల గూడు కట్టుకున్నారు. వాతావరణం సాధారణ స్థాయికి రావడంతో తిరిగి రామానాయుడు కార్యాలయానికి ప్రజలు తమ సమస్యలు చెప్పుకునేందుకు క్యూ కడుతున్నారు. దీనికి తోడు ఎన్నికల్లో రామానాయుడు భారీ మెజార్టీతో గెలుస్తారన్న ధీమా ఏర్పడటంతో పాటు రాష్ట్రంలో కూటమే అధికారం చేపడుతుంది. అన్న విశ్వాసం ప్రజలు నమ్ముతున్నారు. కాబట్టే ఎమ్మెల్యే రామానాయుడు కార్యాలయం తిరిగి ప్రజలతో సందడి నెలకొంది. పలువురు సమస్యలను విన్న రామానాయుడు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

అభ్యర్థుల్ని కలిసిన టీడీపీ నాయకులు

నరసాపురం టౌన్, మే 14: ఎన్నికలు కూటమికి అనుకూలంగా ఉండటంతో మంగళవారం నియోజకవర్గ టీడీపీ నాయకులు ఎంపీ అభ్యర్థి శ్రీనివాసవర్మను మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందించారు. ఆనంతరం ఉండి టీడీపీ అభ్యర్థి రఘురామకృష్ణరాజును కలిసి ఆయనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో పోలింగ్ తీరును ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు వివరించారు. ఈ కార్యక్రమంలో కొప్పాడ రవి, జక్కం శ్రీమన్నారాయణ, జోగి పండు, కొల్లు పెద్దిరాజు, ఆధికార ఆనంతరామరావు, గుబ్బల నాగరాజు పాల్గొన్నారు.

రఘురామ జన్మదిన వేడుకలు

ఉండి/భీమవరం అర్బన్/నరసాపురం, మే 14: ఉండి టీడీపీ అభ్యర్థి కనుమూరు రఘురామకృష్ణరాజు జన్మదినం వేడుకలు పెదఅమిరంలోని ఆయన గృహం వద్ద నిర్వహించారు. రఘురామకృష్ణరాజు కేక్‌ను కట్ చేశారు. భార్య రమాదేవి, కుమార్తె ఇందిరా, కుమారుడు భరత్‌లకు కేక్‌ను తినిపించారు. రఘురామకృష్ణరాజుకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఎమ్మెల్యే మంతెన



తాడేపల్లిగూడెంలో విలేకరులతో మాట్లాడుతున్న బొలిశెట్టి, వలవల, తాతాజీ

రామరాజు, ఆయన సోదరుడు నరసింహరాజు, జనసేన ఇన్‌చార్జు జుత్తుగ నాగరాజు, సీనియర్ నాయకుడు కొత్తపల్లి నాగరాజు, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వహణ కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు, భీమవరం నియోజకవర్గ జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు శుభాకాంక్షలు తెలియజేశారు.

వెల్లువెత్తిన అభిమానం

తాడేపల్లిగూడెం అర్బన్, మే 14: తాడేపల్లిగూడెంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్‌కు ముందస్తు శుభాకాంక్షలు తెలిపేందుకు నియోజకవర్గం చుట్టుపక్కల నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలు వెల్లువెత్తారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో పూలదండలు, పుష్పగుచ్ఛాలు, శాలువలతో బొలిశెట్టిని ముంచెత్తారు. ఈ సందర్భంగా బొలిశెట్టి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి నాయకులు, కార్యకర్తలు అందించిన సహకారాన్ని ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటానన్నారు. ఏ కష్టమొచ్చినా ప్రతి ఒక్కరికి అండగా ఉంటానన్నారు.

రాష్ట్రంలో రామరాజ్యం రాబోతోంది: బొలిశెట్టి

తాడేపల్లిగూడెం అర్బన్, మే 14: రాష్ట్రంలో రామరాజ్యం రాబోతోంది. చంద్రబాబు సీఎం కానున్నారు. నాకు ఓటు వేసిన ప్రతీ ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నానని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో బొలిశెట్టి మాట్లాడుతూ ప్రజలందరికి నిరంతరం



పెదఅమిరంలో జన్మదిన కేక్ కట్ చేస్తున్న ఉండి టీడీపీ కూటమి అభ్యర్థి రఘురామకృష్ణ రాజు

అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎన్నికలలో కొంతమంది పోలీసులు కొట్టు సత్యనారాయణకు అనుకూలంగా పనిచేశారన్నారు. ఓటమి భయంతో కొట్టు తప్పుడు రాజకీయాలు చేశారన్నారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వలవల బాబ్జి మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలో కూటమి అభ్యర్థి బొలిశెట్టి భారీ మెజారిటీతో గెలుస్తున్నారన్నారు. వైసీపీ అభ్యర్థి కొట్టుకు ఓటమి తప్పదన్నారు. జిల్లాలో అన్ని స్థానాలను కూటమి కైవసం చేసుకుంటుందన్నారు. దమ్ముంటే తాము చేసిన అవినీతి ఏమిటో కొట్టు నిరూపించాలంటూ సవాల్ విసిరారు. కొట్టు చేసిన అవినీతిపై రోజుకు ఒకరితో మాట్లాడిస్తానన్నారు. తాడేపల్లిగూడెంలో ఉన్న వ్యాపారులందరికి హామీ ఇస్తున్నామని వారి వ్యాపారాలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేసుకోవచ్చునన్నారు. బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ మాట్లాడుతూ పోలింగ్‌లో ప్రజల్లో చైతన్యం కనిపించిందని, ఎన్డీయే కూటమి భారీ విజయాన్ని సాధిస్తుందన్నారు. బండి పెద్దిరాజు, పాలూరి వెంకటేశ్వరరావు, వర్తనపల్లి కాశి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ ప్రక్రియ దస్త్రాల పరిశీలన

భీమవరం టౌన్, మే 14 : పాలకొల్లు నియోజకవర్గం పోలింగు ప్రక్రియకు సంబంధించిన దస్త్రాలను సాధారణ పరిశీలకులు ఎం.దీప సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టరు సుమిత్ కుమార్ పరిశీలించారు. మంగళవారం బీవీ రాజు ఫౌండేషను బి.సీతా పాలిటెక్నిక్ కాలేజీలో ఓటర్లు సంతకాలు చేసిన రిజిస్టర్లను పరిశీలించి, ఫొటో గుర్తింపు కార్డుపై ఎంత మంది ఓటు వేశారు, ఇతర ఐడి కార్డులు చూపించి



రికార్డులను పరిశీలిస్తున్న పరిశీలకురాలు ఎం.దీప

ఎంతమంది ఓటు వేశారని ఆమె పరిశీలించారు. పోలింగుకు సంబంధించిన పీవోలు, ఏపీవోలు లేఖలను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. పాలకొల్లు నియోజకవర్గంలోని 40 పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన ద స్త్రాలను పీవోలు, ఏపీవోలు లేఖలను పరిశీలించి, రిటర్నింగ్ అధికారిని కొన్ని వివరాలను సాధారణ పరిశీల కులు ఎం.దీప అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు నియోజకవర్గం ఆర్వో బి.శివనారాయణ రెడ్డి, లైజన్ ఆఫీసరు ఎ.వి.అప్పారావు పాల్గొన్నారు.

ఫలించని వలంటీర్ల వ్యూహం

ఆకివీడు, మే 14 : వైసీపీ నమ్ముకున్న వలంటీర్ల వ్యూహం ఫలించలేదు. సార్వత్రిక ఎన్నికలల్లో వలంటీర్ల ప్రభావం మచ్చుకైనా కనిపించలేదు. ప్రభుత్వంలో పనిచేసిన వలంటీర్లు అంతా రాజీనామా చెయ్యాలని చివరి నిమిషం వరకు వైసీపీ నాయకులు, అభ్యర్థులు తీవ్ర స్థాయిలో ఒత్తిడి చేశారు. రాజీనామా చేసినవారితో ఎన్నికల ప్రచారాలు నిర్వహించుకున్నారు. పెన్షన్‌లు, రేషన్, ఇంటింటికి పంపిణీచేసే వలంటీర్లతో తమకు మేలు జరుగుతుందని వైసీపీ భావించింది. కేడర్‌ను విస్మరించింది. ఎన్నికల రోజు వలంటీర్ల ప్రభావం కనిపించకపోగా, క్యాడర్ కూడా దూరం అయింది. గ్రామాల్లో శిబిరాలు కానరాలేదు. వలంటీర్లు పోలింగ్ కేంద్రాల వద్ద తారసపడలేదు. దీనిపైనే అధికార పార్టీ అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. జిల్లాలో 9,200 మంది వలంటీర్లు పని చేశారు. ఇందులో వైసీపీ వత్తిడిని తట్టుకోలేక 4వేల 200 మంది రాజీనామా చేశారు. వైసీపీ అభ్యర్థులు తాయిలాలు ఇచ్చారు. ఒక్కొక్క వలంటీర్‌కు రూ.20వేల వంతున ముట్టజెప్పారు. వలంటీర్లు అంతా ప్రచారంలో పాల్గొన్నారు. సొమ్ములు పంపిణీలో ముందుఉన్నారు. వీరి ప్రభావం ఓటర్లపై మచ్చుకైన కనిపించలేదు.

ఓటు పడింది..తీర్పు మిగిలింది

ఆకివీడు, మే 14: ఓట్ల పండగ ముగిసింది. అభ్యర్థుల్లో టెన్షన్ గూడు కట్టుకుంది. ని యోజకవర్గంలో బూత్‌ల వారీగా లెక్కింపు ఆరంభమైంది. ప్రతీచోట ప్లస్, మైనస్‌లను బేరీజు వేసుకుంటున్నారు. పోలింగ్ ముగిసిన తరువాత కాస్తంత హాయిగా గడపాల్సిన అభ్యర్థులు మంగళవారం లెక్కల్లో తేలియాడారు. కాస్త అటు..ఇటుగా గెలుపు తమవైపే ఉండబోతున్నట్లు అభ్యర్థులు అంచనాకు వచ్చారు. మరికొందరు మా త్రం సైలెంట్ ఓటు ఏ పక్షాన్ని దెబ్బ తీయబోతుందోనన్న ఆందోళనలో ఉన్నారు.

భీమవరం రూరల్: మా ఊరిలో.. ఓట్లు ఎక్కువ పోలయ్యాయి.. మా ఊరిలో గతం కంటే ఎక్కువ ఓట్లు పడేలా చేసిన ప్రయత్నాలు ఫలించాయి అనే లెక్కలతో.. భీమవరం నియోజకవర్గం కూటమి నాయకులు జోష్‌గా ఉన్నారు. గ్రామాలలో 90 శాతం ఓట్లు పోలవ్వడంపై వారు కూటమికే అత్యధిక ఓట్లు పడతాయే లెక్కలు వేస్తున్నారు. భీమవరం మండలంలో రాత్రి వరకు ఓట్లు వేసేందుకు ఓటర్లు శ్రద్ధ చూపడం ఓట్లు శాతం ఎక్కువ నమోదుకు కారణంగా నిలిచింది. దీంతో గ్రామాలలో అభ్యర్థి విజయంలో మెజార్టీ పెంచేందుకు ఉపయోగపడుతుందని కార్యకర్తలు అంచనాలతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గెలుపు పై ఎవరి ధీమా వారిదే

గణపవరం, మే 14: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిసిన నేపథ్యంలో రాజకీయ పార్టీల నాయకులు తమ అభ్యర్థుల గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఏ నలుగురు కలిసిన ఎన్నికల ఫలితాల పై చర్చ జరుగుతోంది. పోటీ చేసిన అభ్యర్థులు సైతం కూడికలు, తీసివేతలతో అంచనాల్లో మునిగి తేలుతున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో ప్రధాన పార్టీలైన జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుప్పాల శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ నుంచి పాతపాటి హరికుమార్‌రాజు పోటీ చేశారు. ప్రతీ గ్రామం నుంచి ఆయా పార్టీల కార్యకర్తలను పిలిపించుకుని ఎన్ని ఓట్లు వచ్చాయని లెక్కలు వేసుకుంటున్నారు. అన్ని మండలాల్లో జనసేన, వైసీపీ మధ్య పోటీ నెలకొంది. నెలరోజుల నుంచి కార్యకర్తలతో జాతరలా కనిపించిన పార్టీ కార్యాలయాలు నేడు వెలవెలబోతున్నాయి.

కాయ్ రాజా కాయ్

ముదినేపల్లి, మే 14 : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగియటంతో ఫలితాలు, మెజారిటీలపై పందెం రాయుళ్లు రంగంలోకి దిగారు. ప్రభుత్వం ఏర్పాటు, పలు నియోజకవర్గాల ఫలితాలపై ముదినేపల్లి ప్రాంతంలో పందేలు జరుగుతు న్నాయి. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడం ఖాయమని పలువురు పందేలు కడుతుండగా, వైసీపీ ప్రభుత్వం తిరిగి అధికారంలో వస్తుందని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పందేలకు దిగుతున్నారు. ఏ పార్టీకి ఎన్ని అసెంబ్లీ సీట్లు వస్తాయన్న అంశంపై కూడా పందేలు కడుతున్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం వివిధ ప్రాంతాల్లో ఆయా పార్టీల పరిస్థితిపై సమాచారం సేకరించి బెట్టింగులకు దిగుతున్నారు. కైకలూరు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్ గెలుపుపై కూడా పెద్ద ఎత్తున పందేలు జరుగు తున్నాయి.

పందేలకు నో

నరసాపురం, మే 14: ఈసారి పెద్ద మొత్తాల్లో పందేలు జరుగుతాయన్న ఊహాగానాలకు ఎన్నికల సరళితో చెక్ పడింది. కూటమికి అనుకూలంగా ఓటింగ్ జరిగిందన్న ఊహాగానాలు షికారు చేయడంతో పందేల రాయుళ్లు ఎవ్వరూ సీట్లపై బెట్టింగ్ పెట్టేందుకు ముందుకు రావడం లేదు. గతంలో నరసాపురం సీటుపై కోసి పందేలు జరిగేవి, కూటమి గెలుపై ఒకటి రెండు రెట్లు కూడా పందేలు కట్టారు. ఆయితే ఎన్నికల తరువాత ఈ సీన్ కనిపించడం లేదు. అయితే మెజార్టీపై రానున్న రోజుల్లో పందేలు కాసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే కూటమి భారీ మెజార్టీ వస్తుందని ఆపార్టీ శ్రేణులు ధీమాతో ఉన్నారు. ఆ స్థాయిలో మెజార్టీ రాదని వైసీపీ నాయకులు పేర్కొంటున్నారు. తమకు సైలెంట్ ఓటింగ్ పడిందన్న ధీమాతో ఉన్నారు.

కూటమి నాయకుల్ని కలిసి బొమ్మిడి కృతజ్ఞతలు

నరసాపురం, మే 14: ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో మంగళవారం పార్టీ నాయకులంతా ఇళ్లకే పరిమితవయ్యారు. పట్టణ, గ్రామాల నుంచి వచ్చిన నాయకులతో పోలింగ్‌పై ఆరా తీశారు. జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్ మాత్రం తనకు సహకరించిన టీడీపీ, బీజేపీ, జనసేన ముఖ్య నాయకుల ఇళ్లకు వెళ్లి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో మీరందించిన సహకారం వల్లే కూటమి విజయం సాధిస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు.

రేపు ట్రస్టు ఆస్పత్రికి వైద్య నిపుణుల రాక

పెంటపాడు, మే 14: అలంపురం ట్రస్టు ఆస్పత్రికి ఈ నెల 16న రాజానగరం జీఎస్ఎల్ ఆస్పత్రి నుంచి ప్రత్యేక వైద్య నిపుణులు వస్తున్నట్లు ట్రస్టు ఛైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. ఎముకలు, కీళ్ళు, జనరల్ సర్జన్, చర్మవ్యాధులు, ఊపిరితిత్తులు, చెవి, ముక్కు, గొంతు సంబంధ వైద్య నిపుణలు ఉచితంగా వైద్య సేవలు అందిస్తారన్నారన్నారు. అవసరమైన వారికి అన్ని రకాల రక్త పరీక్షలతో పాటు ఈసీజీ, అల్ట్రాసౌండ్ తదితర పరీక్షలు ఉచితంగా చేస్తారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

వృద్ధులకు ఉచిత వైద్య సేవలు



తణుకు, మే 14: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, జనరిక్ మందులు షాపు ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం వయో వృద్ధులకు నిర్వహించే బీపీ, షుగర్ పరీక్షలను డాక్టర్ బి. రమేష్ చంద్రబాబు 28 మందికి ఉచితంగా అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. సంఘ జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, సంఘ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, కాయల నాగేశ్వరరావు, ద్వారంపూడి బాపిరెడ్డి, ఇవటూరి లక్ష్మణరావు, సీఎస్ సాధు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు రూ.600 వేతనం ఇవ్వాలి



పని ప్రాంతంలో కూలీల నిరసన

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 14: ఉపాధి హామీ పథకంలో కూలీలకు కనీస వేతనం రూ.600 చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. పెదతాడేపల్లిలోని ఉపాధి హామీ పని ప్రదేశం వద్ద కూలీలతో కలసి నిరసన తెలిపారు. కూలీలకు కనీసం 200 రోజులు పని కల్పించాలని, సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని, పలుగు, పారకు డబ్బులు చెల్లించాలని నినాదాలు చేశారు.

స్ట్రాంగ్ రూమ్‌లకు భద్రత

ఉండి, మే 14: స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టరు, ఉండి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సీపీ ప్రవీణ్ ఆదిత్య తెలిపారు. మంగళవారం ఈమేరకు ఒక ప్రకటనలో వివరాలను అందించారు. ఉండి అసెంబ్లీ స్థానానికి ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలను నిర్వహించామన్నారు. దొంగ ఓటుమీద ఎలాంటి ఫిర్యాదు తమకు అందలేదన్నారు. కొన్ని ప్రాంతాలలో రాత్రి 11గంటల వరకు పోలింగ్ కొనసాగిందన్నారు. క్యూలో వున్న ప్రతీ ఒక్కరికి ఓటును కల్పించామని అధికారులు తెలిపారు. ఉండి నియోజకవర్గంలో 86.20శాతం పోలింగ్ నమోదు అయ్యిందన్నారు.

చురుగ్గా పంటబోదె తవ్వకం పనులు



మొగల్తూరు, మే 14: మండలంలోని పలు గ్రామాల్లో పంట బోదె తవ్వకం పనులు చురుగ్గా సాగుతున్నాయి. కెపి పాలెం నార్త్, సౌత్, పేరుపాలెం నార్త్, మొగల్తూరులోని పలు ప్రాంతాల్లో మంచినీటి చెరువులకు నీరు అందించే పంట బోదెలు తవ్వుతున్నారు. మంగళవారం మోడి గ్రామంలో సుమారు 3 కిలో మీటర్లు మేర పంట బోదె తవ్వకం పనులు చేపట్టారు. ఈపనులు టీఏ వెంకటేశ్వరరావు, జేఈ ఆనంద్ పరిశీలించి కూలీలకు తగు సూచనలు చేశారు.

ఓట్లు ఎవరికి పడ్డాయబ్బా..

లెక్కల్లో నిమగ్నమైన నాయకులు

చాట్రాయి, మే 14: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగియటంతో టీడీపీ, వైసీపీ గ్రామ, మండల స్థాయి నాయకులు ఓట్ల లెక్కల్లో నిమగ్నమయ్యారు. నిన్నటి వరకు కార్యకర్తలు అభిమానులతో సందడిగా కన్పించిన నాయకుల ఇళ్ళు, పార్టీల కార్యాలయాలు జనం లేక బోసిపోయాయి. నెల రోజులుగా అభ్య ర్థుల పర్యటనలు, నాయకులు ఇంటింటి ప్రచారాలు, మైక్ అనౌన్స్‌మెంట్లతో హోరెత్తించగా, ఇప్పుడు గ్రామాల్లో అంతటా నిశ్శబ్దం నెలకొంది. టీడీపీ, వైసీపీ గ్రామ, మండల స్థాయి నాయకులు పోల్ మేనేజ్‌మెంట్‌లో పాల్గొన్న ముఖ్య కార్యకర్తలతో సమావేశాలు జరిపి వార్డులు, సామాజిక వర్గాల వారీగా వచ్చే మెజారిటీ, మైనస్ గురించి సుదీర్ఘంగా చర్చించి ఒక అంచనాకు వస్తున్నారు. తమ గ్రామంలో, మండలంలో వచ్చే ఓట్ల వివరాల అంచనాలను అభ్యర్థులకు నాయకులు అందజేస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఓటర్లు సైలెంట్ గా ఓట్లు వేయటం వల్ల జనం నాడి నాయకులకు అందటం లేదు. అయినా గెలుపు తమదేనని ఇరు పార్టీలు ధీమా వ్యక్తం చేయటం గమనార్హం. గత కొద్ది నెలలుగా జిల్లాలో, రాష్ట్రంలో ఎక్కడా వైసీపీ, టీడీపీ సభలు సమావేశాలు జరిగినా వ్యయ ప్రయాసలను లెక్కచేయకుండా హాజరవుతూ తీరిక లేకుండా గడిపిన నాయకులు కార్యకర్తలు రిలాక్స్ మూడ్‌లోకి వచ్చారు. నూజివీడు అసెంబ్లీ, ఏలూరు పార్లమెంట్ సీట్లపైనా, కూటమి ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని, వైసీపీ సర్కార్ వస్తుందని, రాష్ట్రంలో ప్రముఖులు పోటీ చేస్తున్న నియోజకవర్గాల పైనా పందేలు జోరుగా జరుగుతున్నాయి. ఈసారి పోలింగ్‌కు, ఓట్ల లెక్కింపునకు 20 రోజుల వ్యవధి ఉండటంతో ఫలితాలు ఎలా ఉంటాయోనని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

సమాచార సేకరణలో నాయకులు..

ముదినేపల్లి రూరల్: నెల రోజులుగా ఎన్నికల బిజీలో క్షణం తీరిక లేకుండా ఉన్న గ్రామ, మండల స్థాయి నాయకులు మంగళవారం రిలాక్స్ అయ్యారు. గ్రామాల వారీగా బూత్‌లలో ఏ మేరకు మెజార్టీ వస్తుందని మం డల, గ్రామ స్థాయి నాయకులు ద్వారా సమాచారం తెప్పించుకుంటూ బేరీజు వేసుకుంటున్నారు. వడాలి, గురజ, పెనుమల్లి, శ్రీహరిపురం, చేవూరు పాలెం, కోడూరు, సింగరాయపాలెం, పెదగొన్నూరు, ఉప్పరగూడెం బూత్‌లలో 300 నుంచి 600 వరకు మెజార్టీ వస్తుందని టీడీపీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నా రు. బొమ్మినంపాడు, నారాయణపురం, వాడవల్లి, ఊటుకూరు, విరాలిగుంట, చిన్నపాలపర్రు, ములకలపల్లి గ్రామాల్లో అధికార పార్టీకి అను కూలంగా ఓట్లు పడినట్లు సమాచారం. మిగిలిన గ్రామాల్లో ఎన్డీఏ అభ్యర్థికి మెజార్టీ వచ్చే అవకాశం ఉందని గ్రామస్థాయి నాయకులు అంచనా వేస్తున్నారు. మహిళా ఓటర్లు అధిక శాతం చంద్రబాబునాయుడు మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలకు ఆకర్షితులై ఓటింగ్‌లో ఉత్సాహంగా పాల్గొని కూటమి అభ్యర్థికి ఓట్లు వేశారని గ్రామాల్లో చర్చ జరుగుతోంది.

ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధం

చాట్రాయి, మే 14: చాట్రాయి మండలంలో రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధం అవుతున్నారు. ముందుగా పశువుల ఎరువును ట్రాక్టర్లతో పొలాలకు తరలించటం ప్రారంభించారు. భూముల్లో పశువుల ఎరువు చల్లి వేసవి దుక్కులు దున్నటానికి ఏర్పాట్లు చేస్తున్నారు. వేసవి దుక్కుల వలన భూమి గుల్లబారి పైర్లు ఏపుగా ఎదగటమే కాక, భూమిలో తేమ ఎక్కువ రోజులు నిల్వ ఉండటం, చీడపీడల బెడద తగ్గిపోవటం వలన మండలంలో ఎక్కువ శాతం రైతులు వేసవి దుక్కుల విధానం అనుసరిస్తున్నారు. ఉచిత విద్యుత్ విధానం అమలులోకి వచ్చిన తరువాత రైతులు వరి సాగు, జరీబు, మెట్ట, అన్ని రకాల భూముల్లో బోరుబావులు తవ్వించుకొని విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో ఖరీఫ్‌లో వరి, రబీలో మొక్కజొన్న పంటలు పండిస్తూ లాభాలు పొందుతున్నారు. తొలకరి వర్షాలు పడగానే చెరువుల్లోకి నీరు రాకపోయినా బోరుబావుల కింద వరినార్లు పోసి జూలై మొదటి వారంలోనే వరి నాట్లు వేస్తున్నారు.